# ఇశ్వ యిందూ పరిషత్

ఆపొద్దు కండ్లు నులుము కుంటానే నిద్దర లేచినా. బలంతంగా కండ్లు తెర్సినా. తెర్సినకండ్లు తెర్సినట్టే నీలుక్కోని పాయ!

మాతల్లిసాచ్చిగా చెప్తావుండా. ఏడుమంది ఐ.ఏ.ఎస్. ఆపీసర్లను అన్నలు ఒక్కేటుకు ఎగరేసుకోని పాయ్ దిక్కుండే కోరట్లో దాఖల్ చేసుకోండని ఈ ప్రెబుత్వాన్ని గుట్టకు గుక్కెడునీళ్లు తాగిపించి ఏడిపిస్తే నేను నవ్వుకుణ్ణా! ఈపొద్దు ఆత్మసాచ్చి పురమాయించిందని ఎన్టీయారోడు దిగిపాయ్‌నాడంటే గూడా నేను నువ్వుకుంటా. ఎందుకంటారా యివన్నీ వడ్లగింజిలో బియ్యపుగింజి కతలే!

అయితే నీ కొంపలో నిద్దరలేస్తానే తెర్సినకండ్లు తెర్సినట్టుగానే నీలుక్కోని పొయ్యే యిచ్చిత్రం ఏం జరిగిందబ్బా అంటేరేమో? అదే చెప్తా ఉండా!

''జానడింట్లో మూరడు కట్టె. ఎట్టకొట్టావో కొట్రా మొగడా? అనేమాదిరుండే ఈ కొంపలో పిల్లాజల్లా అందురికంటే ముందుగా నేనే నిద్దరలేస్తా. మొకం గికం కడుక్కుంటా. గొల్సుకు కట్టేసుండే కుక్క కుయ్యో కుయ్యోమని కొట్టుకున్నెట్టు 'కాపీ కాపీ!' అని కొట్టుకుంటే అప్పుడు మా బాశాలి నిక్కతా నీలగతా నిద్దర్లేస్తింది. అటుమంటి ఆడది నాకంటే ముందుగా నిద్దరలేస్తిందా? లేచింది బో? అంతమంచి మొకానికి అర్ధసేరు పసుపా? అన్నెట్టు ముత్తెమంత పసుపు పూసుకోని పావలాకాసంత కుంకంబొట్టు పెట్టిందా?

పెట్టింది బో! మా పెండ్లి నాటి మూర్తంచీర. మడత నలక్కుండా పెట్లో కాపరం పెట్టేసుండె. దాన్నెత్తి సింగారించు కుంటిందా? సింగారించు కుణ్ణింది బో! నిద్దర లేస్తానే నాకాళ్ళు తాకి కండ్లకు అద్దుకుంటిందా?

మొదులు సంపంగి పూస్తే కొన మోదగ పూస్తిందా? అన్నెట్లు తల్లే అంత పని చేస్తే యింక పిలకాయిలు మాత్రం ఏం తక్కువ తిన్నోళ్లా? ఒకరి ఎంట యింకొకరుగా వచ్చి కాళ్లమింద పడ్తావుంటే నిజం చెప్పద్దూ? నా వొళ్లు అట్నే జిలపరించె. ఈ పొద్దు యాళ్లందురికీ ఏమయిందో ఏం పాడోగానీ అందురూ మారిపొయ్యుడేది చూస్తా ఉంటే వల్లకాటికాడ శాతొచ్చినోడు శాతగానోడు అందురూ యాందాంతులైపొయ్ నట్టుండాది.

ఇది నా యిల్లేనా? నా ఎదురుగా నిల్సుకోనుండేది మా బాశాలేనా? అని ఎగాదిగా చూస్తే నాకేం డవుటు గలగలా. అయితే వచ్చిన డవుటంతా నిన్న నిద్దర లేచినపుడు లేంది ఈపొద్దు నిద్దర లేచేకుందికి ఎట్టొచ్చిందబ్బా? అని.

పోనీ! ఆస్తి హక్కులిచ్చినాడు గదా అన్న. ఇంకేం పరావాలేదనుకోని ఆయనగాని చెవుగొరికుంటే పసుపుచీర కట్టుకోవాల. మరి పట్టుచీర కట్టిందే? ఆడదంటే అదవకాదని ఏయదవన్నా ఎక్క పెట్టుంటే ఎగిరి నా జుట్టు పట్టుకోవాల. నా కాళ్లు పట్టుకుణ్ణిందే? ఎక్కడుందబ్బా దీనికి బిస? అని తలకాయి తిరిగి పొయ్యేటట్టుగా రామన్ననను పడదొయ్యాలని శీనన్న.. శీనన్నను చిత్తు చెయ్యాలని రామన్న ఆలోచించినంత గెట్టిగా ఆలోచించుకుంటా ఉంటే అది మా బాశాలికి బద్ధకమనిపించి నట్టుండాది.

''అయ్యో! నీ బద్దకం బంగారంగానూ. లెయ్యే! నిద్దర లేస్తానే మొకం కడుక్కుండే దానికంత మొందు కావాలనుకునే నీ బోటి మొగోళ్లంతా ముందుగా ఆడికిపొయ్ రావాల్నే?''

'' ఏం? ఆడేమన్నా మొందు సలింద్రం పెట్నారా?''

''చిన్నంగా అంటావా ఆ మాట? ఆడికిపొయ్ చూడుబోయే. లచ్చలకు లచ్చలు కర్సు పెట్నారు. ఇసికేస్తే రాలనంత జనమే. ఎక్కడెక్కడోళ్లు ఆణ్ణే ఉండారు. ఆడికిపొయ్ ఆ మొందురుచి మరగాల్నే కానీ... లెయ్యే! లేచి తల మొలా కడుక్కోని అట్టా ఆరో మైలు దాకా పొయ్‌రాబో.''

''అయితే ఆ మత్తులోనేనా నువ్విప్పుడు మునిగి పొయ్యుండేది?''

''పోతేగదంటే తెల్సేది. ముందుగా నువ్వాడికి పొయ్ రాబో!''

రొండు దినాలుగా ఆరోమైలు కాడ యిశ్వయిందూ పరిషత్తు మీటింగులు జరగతా ఉండాయంటే ఈ మతం పిచ్చోళ్లతో మనకేం పనిలే? అనుకుంటా ఉంటి. ఇప్పుడు చూడబోతే మా బాశాలి నడతానాణెం రొండూ మారిపొయ్ ఉండాయి. అయితే దీనికత ఏందో తెల్సుకోవాలనే ఎలబార్నా!

ఇంట్లోనుంచి కాలు బయిటికి ఎలపెరుక్కుంటే నాకా నాలుగ్గాళ్ల మండపం గాలి తగలకుండా పోదు. ఆ గాలి అట్టా సోకిందంటే నాకా మిందట గాలిసోకినట్టయి పోతింది.

ఆడ నలుగురి నాలుగిదాలుగా మాట్లాడ్తారు? ఇంక గాలి సోకేదేంది? ఏకంగా దెయ్యం పట్టు కుణ్ణెట్టే గదా?

''ఒరే! ఈ కరిణె యీ మట్టపలక యిట్టా శాతబట్టుకోని యీడ పడిగాపులు కాసే దానికంటే ఆడ ఆరోమైలుకాడ ఏందో పరిషత్తు జరగతా ఉండాదంట. నిలికేలేని జనమంట. ఆడికిబొయ్ బొటానాలు అమ్ముకుంటే గూడా మూడుపూట్లు పొట్టపూడి పొయ్యేదిరా.''

''బొటానాలమ్ముకుంటేనేనా పొట్ట పూడేది? వాళ్లు మాట్లాడ్తావుండే మాట్లా! అవ్వి యింటా కూసుంటే చాల్దా?''

''ఇద్దో! ఊరు చూడ్రా అంటే ఉత్తరం చూడ్రా అనే మాట్లేగదా వద్దనేది. పాపం! వాళ్లేందో? వాళ్ల బాదేందో? మన కెట్ట తెలిస్తింది లేరా?''

''వాళ్లకేం- బాదరా? దేశం మిందబడి లచ్చలకు లచ్చలుతండి లచ్చణంగా తింటా తేపతా ఉంటే వాళ్లకేదో బాదంట బాద! పో నాయినా పో! పొయ్ ఆ బాదేందో తీర్సేసి రాబో.''

''ఒరే! ఈ దేశింలో శాతగాల్నేకానీ అదేంద్దైనా యాపారమే గదరా? ఆనోకం తెల్సుకుంటారు. ఎవుడికి శాతొచ్చిన యాపారం వాడు చేసుకుంటాడు. కూడూ కూరగా తింటాడు. వాలోళ్ల బతుకులు వాలోళ్లవి. అవన్నీ మనకెందుగ్గానీ మన బతుకుల కత చూడంఁడ్రా!''

''అద్దో! యిట్టాంటి బుద్దిలేని కూతలేగదా కుయ్యద్దు అనేది. నువ్వన్నెట్టు అది యాపారమే అయితే అంతంత పెద్ద సాములు ఎట్టొస్తార్రా? కంచి సాములవారొచ్చిరి. ఏర్పేడు సాములవారుండనే ఉండ్రి. మా రాజాలొచ్చిరి. మత్తేబులొచ్చిరి. ఈళ్లంతా ఏం సటపటమయిన మణుసులను కుణ్ణావా? – యిది యాపారమయితే వచ్చేదానికి? నోటికి ఎట్టొస్తే అట్టకూస్తే ఎట్రా?''

నాలుగ్గాళ్లమండపం కాడ చేరుకోని నలుగురు నాలుగురకాలుగా మాట్లాడ్తావుంటే యింటి. నా మణుసు ఎట్టెట్నో పాయ. బుర్ర ఏడెక్కి పాయ. ఇంక ఆడ ఒక వక్కపొలుకు కొరికినంత సేపుగూడా నిలబడలేకపోతి. ఆరోమైలు కాడికి నడ్సిపొయ్యే దానికి అయితిందా? అందుకే బస్సెక్కితి. బస్సులో కూసుణ్ణాకూడా కూలు కుదరకపాయ!

వాళ్లు మాట్లాడ్తా ఉణ్ణింది తల్సుకుంటే అసలు మనకూ ఒక మతం ఉండాదని ఈ యదవలకంతా ఎరికేనా? మతం ఉండాదని తెల్సినా తెలవకుండా పొయ్‌నా మహన్నబావులు మన రాజికీయనాయకులుండారే? వాళ్ల పుణ్ణాన తలావొక కులం ఉండాదని మాత్రం కచ్చితంగా తెల్సు. అయితే ఈ కులాలకంతా కలిపి ఒక మతం ఉండాదని కల్లోగూడా అనుకోరు. అనుకుండేదేంది? అసలు తెల్దు. తెలిసుంటే నవాబులు గుళ్లూ గోపరాలు కొల్లగొట్టుకొని పోతావుంటే చూస్తా బెల్లంకొట్నె రాళ్లమాదిర్తో ఉండేవాళ్లేనా? అప్పుడు ఎంతమంది వాళ్లుణ్ణింది. నూటికి ముగ్గురు. ఆ ముగ్గరే పాకిస్తాన్ కావాలని ముగ్గులోకి

యీడిస్తే తలొగ్గలా? ఒగిటా రొండా? రమారమిగా ఆర్నూరు ఏండ్లు వాళ్లు అట్టా అదరగొట్టా ఉంటే వాళ్లకే బాడ్కోపన్లు చెయ్‌లా? గుండ్లు కొట్టించుకోమంటే కొట్టించుకోలా?

సరే! వాళ్లట్టా పాయ్‌రా. తెల్లోళ్లురానే వచ్చిరి. తెల్లోడంటే వాడేం తెలివి తక్కువైనోడా? ముల్లెలు మూట్లు గట్టి సాగనంపె. కూటికి లేకుండా చేసె. కూటికి మొకం వాసిపొయ్‌నోళ్లను-

''ఒరే కుండాకోర్ యదవల్లారా! తిండికి లేకుండా ఎందుకు చస్తార్రా? మా మతంలో చేరండి. తిండేగాదు సకల సవుక్రేలు కల్పిస్తాం!'' అనె.

ఈ కూలిపొయ్‌న గుంపు కూడూగుడ్డకు ఆశపడి పోలోమని ఆ మతంలో చేరిపోలా?

వాళ్లది దేశిగాని దేశిం. మతంగాని మతం. వాళ్లే ఏండ్ల తరబడి మన మింద ఎక్కి సవారి చేస్తే యింక మనోళ్లు ఉండారుగదా? ఏ తల్లి గన్న బిడ్లో? చల్లపూట తల్సుకోని రొండు చేతులెత్తి దణ్ణం పెట్టాల. ఈళ్లెక్కి సవారి చెయ్‌కుండా ఉంటారా? పాపం! వాళ్లేం నెల తక్కువ పుట్నారా చెయ్‌కుండా చేతులు ముడ్సుకోని కూసుండేదానికి?

గోపరం ఎత్తుండే ఏనిగిని లొంగ దీసుకోవాలంటే మూరడంత అంకుశమే గదా కావాల్సింది. అట్టా మాదిర మెజారిటీ వాళ్ల జుట్టు పట్టుకోవాలంటే మైనారిటీల పట్టుకోవాల. ఈ కిటుకు తెల్సుకుండ్రి. వాళ్లు అడిగింది అడిగినట్టుగా చట్టం చేసి పారేస్తా ఉండారు.

అరెరెరె! ఈ మతాన్నుంచి ఎన్ని మతాలు పిల్లలు పెట్టె. అవన్నీ అంతూపొంతూ లేకుండా యిస్తరిల్లి పోతావుంటే దీనిగెతి ఏందబ్బా? కుక్కలు చింపిన యిస్త్రాకైపోతా ఉండాదే? అని మల్లగుల్లాలు పడ్తానే ఆరోమైలుకాడ దిగేసినా!

అయ్యో! అయ్యో! చూపు అన్నెంత దూరం పందిళ్లే. ఆ పందిళ్ల కింద అంతా జనమే. ఆ గేట్లో దూరిపోతావుంటే వైకుంటంలో అడుగు పెట్నెట్టె ఉండాది. అబ్బబ్బబ్బ! ఏమి లైట్లు? ఏంకత? కండ్లు అట్నే బూసులుగమ్మి పాయ! ఇంకేం పరవాలేదబ్బా? య్యోళ్లకు గూడా యింత తెలివి వచ్చేసిందని మణుసు కొంతలో కొంత నిమ్మతి పడె.

''కూటికి గుడ్డకు నోచకుండా కోటాన కోట్ల మంది అలోరామచంద్రా? అని అల్లాడి పోతావుంటే యిప్పుడేం కొంపలు అంటకపోతా ఉండాయని ఆర్బాటం కోడి తోలుగుడ్లు పెట్నెట్టు ఈ ఆర్బాటమూ ఆ అడావిడీ?''

పొట్టి చొక్కాయి. పొడుగు సొరాయి. చంకలో యీలాంటి సంచి. పిలగాడు శానా బిర్రు మిందుండాడు. ఆడనిలబడుకోని వగస్తా ఉండాడు. అడుగు ముందుకు పడకుండా ఆణ్ణే నిలబడుకుణ్ణా!

''ఒరే పిచ్చోడా! ఈ బుద్ది అందురుకీ ఉండాల్రా. ఏడుకొండలోడు వరాహసామిని

అడుగు మోపే దానికంత జాగా అడిగినాడంట. పోనీలే అనుకోని ఈ సామి ఆసామికి అడుగు జాగా యిచ్చేకుందికి ఏం చేసె? చిక్కంగా నామాలుపెట్టి ఒక మూలకు నెట్టిపారేసె. దేముళ్ల కతే ఆడికుండాది. ఒగిటేమో కసాయి కత్తి. ఇంగొగిటేమో తేనెపూసిన కత్తి. ఈ రొంటి మద్దెబడి తనకలాడ్తా ఉంటే యింకాగూడా తెల్సుకోకపోతే ఎట్రా? సామరస్సె మనేది సరాసవిటిగా ఉండాల్నే గానీ, గూదకు మెత్తన ఆరికి తవుడని ఈ ఒక్క మతాన్నే పట్టుకోని సతాయిస్తే ఎట్రా?''

అట్టా మాదిరిగానే యింగొక్క పిలగాడు ఎదురు దెబ్బకొట్టె!

నాకేమో ఎయ్యేనిగల బలం వొచ్చెసె!

ఎంచి ఏడడుగులు పెట్టే కుందికి ముత్తారెడ్డన్న ఎదురుపడె!

''ఏమిరా అబ్బోడా! మొకం చూస్తే ఎయ్యకాండిల్ బలుబ్ మాదిర ఎలిగి పోతాఉండాదే? ఈ ఊపు కడంతకాలం ఉంటే పరవాలే. తాటాకులమంట కతైతే? పోనీ? యిశ్వయిందూ పరిషత్ అంటా ఉండావే? ముందు నీ ఊళ్లో యిశ్వయిందూ పరిషత్ ఉండాదా చూడ్రా? అది గూడా అట్టపోనీ! అప్పుడెప్పుడో మనూర్లో యిస్కూలికి అజీజ్ అయ్యోరుగా వచ్చినాడా? అప్పిటికా ఊళ్లో ఎవుడైనా సాయిబూ ఉన్నాడా? వచ్చిన మూడో నాటికే మొనగోడు రచ్చబండ మింద రాగి చెట్టుకు నాగూర్‌సామి జండాకట్నాడా? తరతరాలుగా ఊళ్లో రాములవారి గుడి తలుపులు తీసేదిక్కే లేకుండా వుంటే నాగూర్‌సామికి నిత్తెనైవేద్దాలు జరిగి పోతా ఉండాయా? వాడు అసలైన కోడి. ఇవ్వన్నీ ఆర్పాటం కోళ్లు. నువ్వు పదరా అబ్బారే!'' అనె.

''ఓట్లు తండుకుండే దానికి ఎవుడి అగసాట్లు వాడివి!'' అనుకుంటా కొంపకు తిరుక్కుంటి! ●